క్లుప్తంగా...

మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మణికొండ: రాష్ట్ర భూగర్భ వనరులు, సమాచారశాఖ మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన మంత్రి మహేందర్‌రెడ్డికి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసి మంత్రి పదవిని అధిరోహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. నార్సింగి కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు, మణికొండ మున్సిపాలిటీ నాయకులు జయరాజ్, ధన్‌రాజ్, సత్యనారాయణ, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయాల్లోనే మానసిక ప్రశాంతత లభిస్తాయని సంఘసేవకుడు సానెం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శ్రీ వెంకన్న గుట్టపై ఉన్న భూదేవీసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం దేవాలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నాడని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని న్యూ బృందావన్ కాలనీలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రజా సమస్యలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..డివిజన్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. డివిజన్ యూత్ అధ్యక్షుడు రఘుయాదవ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో బహుమతుల ప్రదానం

మైలార్‌దేవ్‌పల్లి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన పాటల కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్ నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వర్ష, మమత లు పాడిన పాటకు నిర్వాహకులు మొదటి బహుమతిని అందజేశారు. మొదటి బహుమతి సాధించిన పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రఘు, ఉపాధ్యాయులు మణిక్యం అభినందించారు.

బాలుడి హత్య.. నిందితుడి రిమాండ్

మైలార్‌దేవ్‌పల్లి: బాలుడి గొంతుకోసి చంపిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం ..బీహార్ రాష్ట్రానికి చెందిన రెండు కుటుంబాలు నిందితుడు పంకజ్ కుమార్ పాశ్వాన్ (32) మృతుడు రాజు పాశ్వాన్ కుటుంబీకులు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో రెండు నెలల క్రితం వలస వచ్చి ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్‌లలో ఉంటున్నారు. ఇద్దరు లేబర్ పనిచేసుకుంటూ.. నివసిస్తున్నారు. మద్యం మత్తులో భార్యపై వివాదాస్పందంగా మాట్లాడటంతో కోపోద్రిక్తుడైన పంకజ్ శనివారం ఉదయం ఇంటికొచ్చిన రాజు పాశ్వాన్‌ను సిగరెట్ త్రాగడానికి బయటకు తీసుకొని వెళ్లాడు. ఇదే అదునుగా భావించి కత్తితో అతడి గొంతును కోసేశాడు. రక్తం తన షర్టుపై చిమ్మడంతో కత్తిని షర్టుతో పాటు దాచేశాడు. నిందితుడిపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయట పెట్టాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆదిత్యా టాలెంట్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ల ద్వారా వాడుతున్న యాప్స్, వివిధ గేమ్స్ ఆడే సమయంలో విద్యార్థులు లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. నేరగాళ్లు పంపే లింక్‌లు ఓపెన్ చేయడం ద్వారా అనేక మోసాలు జరుగుతాయన్నారు. విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకుని తమ ఇంట్లోని తల్లిదండ్రులు ఇతరులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ ఏ.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2.07 కోట్లతో అభివృద్ధి పనులు





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ ఉనికి కోసం ఎన్ని విమర్శలు చేసినా.. తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు.

- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1,2,3,5,15వ డివిజన్‌లలో సీసీరోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీహాల్ పలు అభివృద్ధి పనులకు కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.
- మొత్తం రూ.2.07 కోట్లతో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి వారి సమస్యలు పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.
- రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఇంటింటికీ తాగునీటి సరఫరా, చెరువుల సుందరీకరణ, ఎస్ఎస్‌టీడీపీ నాలాల నిర్మాణం వంటి అనేక పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామన్నారు. అన్ని పార్టీల నాయకులు అభివృద్ధికి సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేష్‌ముదిరాజ్, కార్పొరేటర్లు తలారీ చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతిపాండు, సంతోషిరాజిరెడ్డి, పుష్పమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌ముదిరాజ్, పాపయ్యయాదవ్, సుమన్‌గౌడ్, దశరథ్, పెంటయ్య తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

సాధారణ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ ఫల్గుణ్‌కుమార్

మణికొండ: ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సకాలంలో తీర్చేలా ప్రణాళికతో పనిచేద్దామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో వంద కోట్ల పనులు ఉన్నాయని, నిధుల లభ్యత ఆ స్థాయిలో లేనందుకు ముఖ్యమైన పనులనే చేపడదామన్నారు. గతంలో తీర్మానం చేసిన రూ.98 కోట్ల పనులను ఇప్పటి వరకు చేపట్టలేదన్నారు. పాత పనులు, వాటికి బిల్లుల చెల్లింపులైన తరువాతే కొత్త పనులు చేపట్టాలన్నారు.

- ప్రస్తుత నిధుల లభ్యతను బట్టి రూ. 1.15 కోట్లతో పార్కుల అభివృద్ధి, రూ.1.12 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ. 88 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను రూ. 3.01 కోట్లు, మొత్తం రూ. 6.16 కోట్ల పనులను చేపట్టాలని తీర్మానాలు చేశారు. వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, డీఈ దివ్యజ్యోతి, మేనేజర్ బీఎస్‌కే రమేష్, టీపీఓ రాకేష్, జేఏఓ వీరస్వామి, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రధాన రహదారులను తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని కొత్త పనులపై ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, హెచ్ఎండీఏ, హెచ్ఎండబ్ల్యూఎస్అండ్ఎస్‌బీ, హెచ్ఆర్‌డీసీఎల్, బీజేఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, సీఈఓలు, ఎస్ఈలు, ఈఈలు తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుందని వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు వినతపత్రం అందజేశారు. చేవెళ్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి సోమారం రాజ్‌కుమార్, అత్తాపూర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆగిశెట్టి బాల్‌రాజ్, రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు దామోదర్‌రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాఘవులు, అత్తాపూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్.బాలప్ప, సీనియర్ నాయకులు మల్లిక్, కె.కొండారెడ్డి, మోహన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీతారంజిత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న మిద్దెల సురేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్: టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమితులైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతా రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మిద్దెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. సురేష్‌రెడ్డి, వెంకటేష్, శివారెడ్డి, పీ.ఎం.రెడ్డి, శంకర్, కృష్ణ, హర్షిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవి తదితరులున్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయప్రకాష్ తదితరులున్నారు.

గోల్కొండ రిసార్టుకు అవార్డు



అవార్డును అందుకుంటున్న గోల్కొండ రిసార్ట్ ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని గోల్కొండ రిసార్ట్, స్పాకు హైదరాబాద్ నగరంలో ఉత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్ వెన్యూగా అవార్డు దక్కింది. హైబిజ్ టీవీ వారు హైదరాబాద్ నగరంలోని తాజ్ డెక్కన్ స్టార్ హోటల్‌లో మంగళవారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా గోల్కొండ రిసార్టు ఈ ఏడాది ఉత్తమ వివాహకేంద్రంగా నిలిచిందని జీఎం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. భవిష్యత్తులో అదే స్థాయిని కొనసాగించటంతో పాటు మరిన్ని రంగాల్లో అవార్డులను దక్కించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఇష్టానుసారంగా బిల్లులు వేయొద్దు



జలమండలి మేనేజర్‌తో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పేదలు నివసిస్తున్న గృహాలకు సైతం జలమండలి సిబ్బంది ఇష్టానుసారంగా వేలాది బిల్లులు వేస్తున్నారని, అంతేసి బిల్లులను వారు చెల్లించలేరని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, ఆయా బస్తీల నాయకులతో కలిసి జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డితో చర్చించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శివాజీనగర్, మణికొండ క్వార్టర్స్, శివపురి, పాత గ్రామాల్లో పేదలు నివసిస్తున్నారన్నారు. పేదలపై అధిక బిల్లుల భారం వేయడం సరికాదన్నారు. నగరంలో పేదల బస్తీలకు ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నారని, మున్సిపాలిటీలలో దాన్ని వర్తింప చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ విషయంతో త్వరలోనే జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసి వివరిస్తామన్నారు. అంత వరకు పేదల బస్తీల్లో అంతస్తులను చూసి కాకుండా కనెక్షన్లను బట్టి ఒక్కో కనెక్షన్‌కు రూ. 250లు మాత్రమే బిల్లులు వేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి సానుకూలంగా చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు సమాచారం. కౌన్సిలర్ శ్వేతారవికాంత్‌రెడ్డి, కో- ఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, మాజీ సర్పంచ్ యాలాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ అర్బన్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న అనురాధ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌కు చెందిన అనురాధ బీబీనగర్ బీజేపీ ఓబీసీ రంగారెడ్డి అర్బన్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అలే భాస్కర్, జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌గౌడ్‌లు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరించడంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపులో సోషల్ మీడియా భాగస్వామ్యం ఉంటుందన్నారు. తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, బొమ్మరాజు నర్సింహ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన గౌడ సంఘం నేతలు



రాజేంద్రనగర్: రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. గౌడ సంఘం నాయకులు చంబల శ్రీకాంత్‌గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముద్దగౌని భాస్కర్‌గౌడ్, భరత్, ఆంజనేయులు, పల్లె రామచంద్రయ్య, ఎం.అశోక్, జనార్దన్, సుధీర్, సతీష్‌గౌడ్ తదితరులున్నారు.

చైన్‌స్నాచింగ్ ముఠా రిమాండ్

- 8 కేసుల్లో జైలుకెళ్లొచ్చి.. మరో 8 చోరీలు
- మహిళల దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న వైనం





చోరీ సొమ్ము, బైక్‌లను స్వాధీనం చేసుకున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: మహిళల దృష్టి మరల్చి మెడలోని బంగారు గొలుసులు తెంపేసి పరారవుతున్న ఓ ముఠాను శంషాబాద్ ఎస్‌ఓటీ, తలకొండపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొనిరెడ్డి వంశీ (21) చెడు అలవాట్లకు బానిసై వద్దు చోరీ చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత చైన్‌స్నాచింగ్, ద్విచక్రవాహనాలను చోరీలు చేయడంతో అతడిపై శంషాబాద్, మైలార్‌దేవ్‌పల్లి, కొత్తూరు, షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 8 కేసులు నమోదయ్యాయి. 8 కేసుల్లో పట్టుబడ్డ ఇతడు గతేడాది అక్టోబరులో బెయిల్‌పై విడుదలయ్యాడు. తన చిన్ననాటి స్నేహితులు, పరిచయస్తులైన మరో నలుగురితో కలిసి ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. గొలుసులు, బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల వ్యవధిలోనే కడ్తాల్, తలకొండపల్లి, నాగర్‌కర్నూల్ తండ, కల్వకుర్తి, జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుచోట్ల బైక్‌పై వెళ్తూ.. మహిళ దృష్టి మరల్చి చైన్ స్నాచింగ్‌కి పాల్పడ్డాడు. నందిగామ, మూసాపేట, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. స్నాచింగ్ చేసిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్‌లో పెట్టి డబ్బులుగా మార్చుకుని విలాసాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులతో..

జూలై 30న కడ్తాల్, ఆగస్టు 14న తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్మానుష్య ప్రాంతాల మీదుగా ద్విచక్రవాహనాలపై వెళ్తున్న భార్యభర్తల దృష్టి మరల్చి రెండు చైన్‌స్నాచింగ్‌లు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో తలకొండపల్లి, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి తలకొండపల్లి చౌరస్తాలో ముఠాలోని ప్రధాన నిందితుడు కొనిరెడ్డి శివ (21) అశోక్ (21) సాయిరాం (22)లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు హరీశ్వర్‌రెడ్డి, దుర్గాలు పరారీలో ఉన్నట్టు సమాచారం. నిందితుల నుంచి 17.6 తులాల బంగారంతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలు, చోరీ సొత్తుతోనే కొనుగోలు చేసిన ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారంపై పోలీసులకు సత్వరమే సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. కేసును ఛేదించిన షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, ఆమనగల్ సీఐ వెంకటేశ్వర్లు, తలకొండపల్లి ఎస్సైలు శ్రీకాంత్, వెంకటేష్, ఎస్‌ఓటీ ఎస్సై తరుణ్‌రెడ్డిలను డీసీపీ అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



స్పోర్ట్స్‌క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు 'మట్టిలో మాణిక్యాలని' క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నారని పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ క్రీడల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలు తమ జీవితంలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. మానసిక ఉల్లాసంతో పాటు సమిష్టి కృషి నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణాల్లోని సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ కళాశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడల క్లబ్‌ను ప్రారంభిస్తామన్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించి స్పోర్ట్స్‌క్లబ్ లోగోను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ వెంకటరమణ, డీన్ నరేంద్రరెడ్డి అధికారులు డాక్టర్ సీమ, సత్యనారాయణ తదితరులున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ఎదుట బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న కార్మికులు

రాజేంద్రనగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్న తరుణంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ సీఐటీయూ రాజేంద్రనగర్ డిపో కమిటీ డిమాండ్ చేసింది. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం ఆంధ్రప్రదేశ్ అనుభవాలు విలీనం కమిటీ రిపోర్టు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రతిపాదన అంశాల మీద ప్రచురించిన బుక్‌లెట్‌ను రాజేంద్రనగర్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి పరిస్థితి విలీనానికి ముందు పరిష్కరించాల్సిన పే స్కేల్స్ తదితర అంశాలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కార్మిక సంఘాలను అనుమతించడం లాంటి విషయాలలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఎస్‌బీటీ, ఎస్ఆర్‌బీఎస్ బకాయిల చెల్లింపుల గురించి స్పష్టత అందించాలన్నారు. మితగా అనేక సమస్యలపైన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విలీన కమిటీ అధికారుల కమిటీ కన్వీనర్‌కు వినతిపత్రాలను అందించామన్నారు.

'జియోస్పేషియల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్'పై కార్యశాల



మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

మణికొండ: వినూత్న పర్యావరణ వ్యవస్థను పెంపొందించటం ద్వారా జాతీయ అభివృద్ధి, ఆర్థిక శ్రేయస్సు కోసం దేశంలో జియో స్పేషియల్ రంగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్ సైన్స్, టెక్నాలజీ (ఎన్ఐజీఎస్‌టీ), సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోస్పేషియల్ డివిజన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ, భారత ప్రభుత్వం సంయుక్తంగా జియోస్పేషియల్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌పై మంథన్ కార్యశాలను నిర్వహించింది. సోమవారం నుంచి ప్రారంభమైన కార్యశాల మంగళవారం ముగిసింది. ఈ కార్యశాలకు ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ నాయకత్వం వహించగా.. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ పీజే నారాయణ్‌లు పాల్గొన్నారు. వివిధ ఇంక్యుబేషన్లు, ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు, విజయవంతమైన స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థల నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని చర్చించారు.

సీబీఐటీలో 'అక్షరధాన్' ..

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మూడో 'అక్షరధాన్' కార్యక్రమంలో భాగంగా సీబీఐటీ కళాశాలకు చెందిన 15మంది విద్యార్థులు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందుకున్నారు. ఐటీ హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్‌రంజన్ చేతుల మీదుగా మంగళవారం అందుకున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పదోతరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా గణితం, భౌతికశాస్త్రాన్ని బోధించడంతో ఈ ప్రశంస లభించిందన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.



ప్రశంసా పత్రాలను అందుకున్న సీబీఐటీ అధ్యాపక బృందం